క్లుప్తంగా...

నియామకం



వెంకటేశ్వరకాలనీ: టీడీపీ వెంకటేశ్వరకాలనీ డివిజన్ అధ్యక్షుడిగా బంజారాహిల్స్ రోడ్ నెం. 5 దేవరకొండ బస్తీకి చెందిన సీనియర్ నేత సయ్యద్ ముజ్జు నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని టీడీపీ సీనియర్ నేత అరవింద్ కుమార్‌గౌడ్, టీడీపీ ఖైరతాబాద్ ఇన్‌చార్జి శ్రీనివాస్ నాయుడు సయ్యద్ ముజ్జుకు అందజేశారు. డివిజన్‌లో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా గిరి



పంజగుట్ట: పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా దార్మిరెడ్డి గిరి బాధ్యతలు స్వీకరించారు. గిరి సూర్యాపేట నుంచి బదిలీపై పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చారు. 2013 నుంచి 2015 వరకు పంజగుట్ట ట్రాఫిక్ ఎస్‌ఐగా పనిచేశారు. గతంలో పనిచేసిన అనుభవం ఉన్న నేపథ్యంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తానని, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహిస్తానని ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ గిరి తెలిపారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



వెంగళరావునగర్: అధిక శ్రావణ మాసం అధిక మాసం శుక్రవారం సందర్భంగా వెంగళ రావునగర్ ప్రధాన రహదారిలోని శ్రీసీతారామాంజనేయ స్వామి దేవస్థానంలోని అమ్మవారికి, యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీపోచమ్మ తల్లి విగ్రహానికి గాజులు, వస్త్రాలతో నేత్రపర్వంగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దాంతో ఆయా ప్రాంతాల్లో ఉన్న ఆలయాలన్నీ కిటకిటలాడాయి.

'క్రమబద్ధీకరణ' ప్రక్రియను ముమ్మరం చేయండి



ఫిలింనగర్: జీవో 58 కింద దరఖాస్తులను వెంటనే పరిశీలించి క్రమబద్ధీకరించాలని మాల వెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, బన్నప్ప షేక్‌పేట మండల తహసీల్దార్ అనితారెడ్డికి వినతి పత్రం అందజేశారు. జీవో 59 క్రమబద్ధీకరణకు సంబంధించిన ప్రక్రియ సజావుగా సాగడం లేదని ముమ్మరం చేయాలన్నారు.

అజహరుద్దీన్‌తో కాంగ్రెస్ నేతల భేటీ



అజహరుద్దీన్‌ను కలిసిన నేతలు

శ్రీనగర్‌కాలనీ: టీం ఇండియా మాజీ కెప్టెన్, మాజీ ఎంపీ మహ్మద్ అజహరుద్దీన్ జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తే రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు మోసిన్ ఖురేషి, కిరణ్ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన నివాసంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గానికి ప్రముఖ వ్యక్తి ప్రాతినిధ్యం వహిస్తే అన్ని వర్గాల ప్రజలు ఆదరిస్తారని అన్నారు. పార్టీ పూర్వవైభవం రావాలంటే నూతన నాయకత్వం అవసరమని అన్నారు.

'వర్గీకరణకు మద్దతిచ్చే బీజేపీని భూస్థాపితం చేస్తాం'

ఖైరతాబాద్: ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చే భారతీయ జనతా పార్టీని భూస్థాపితం చేస్తామని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్ అన్నారు. శుక్రవారం మింట్ కంపౌండ్‌లోని అంబేడ్కర్ స్ఫూర్తిభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాంచందర్ మాట్లాడుతూ... షెడ్యూల్ కులాల మధ్య విభేదాలు సృష్టిస్తే సహించేది లేదని, ఎస్సీ వర్గీకరణ అంశంపై బీజేపీ ప్రభుత్వ వైఖరి మార్చుకోవాలని లేని పక్షంలో గతంలో తెలుగుదేశం పార్టీకి పట్టిన గతే బీజేపీకీ తప్పదన్నారు. తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చీఫ్ అడ్వయిజర్ రావుల అంజయ్య, ఆర్‌వై గిరి, జి.శంకర్, శ్రీరాములు, వర్కింగ్ చైర్మన్లు తాళ్లపల్లి రవి, గుడిమల్లె వినోద్‌కుమార్, బేర బాలకిషన్, చీఫ్ కో ఆర్డినేటర్ మందాల భాస్కర్, కో చైర్మన్ గడ్డం సత్యనారాయణ, కల్లు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల వెల్లువ

- ఆహార భద్రత కార్డు తప్పనిసరి
- పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన
- అక్రమాలకు తావులేకుండా పటిష్ట చర్యలు
- అవినీతిపరుల భరతం పడతాం
- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



దుర్గాభవానీనగర్ బస్తీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం

ఫిలింనగర్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన గృహ లక్ష్మి పథకానికి దరఖాస్తులు అందజేస్తున్నారు. ఎమ్మెల్యే కార్యాలయంతో పాటు కార్పొరేటర్లు కూడా దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశాలు వెలువడ్డ నేపథ్యంలో శుక్రవారం దరఖాస్తుదారులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సొంత స్థలం ఉండి ఇప్పటి వరకు ఆర్‌సీసీ శ్లాబ్ ఇల్లు లేని పేదలు ఈ పథకం కింద ఇల్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం రూ. 3 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేయనుంది.

- తొలి దశలో ఒక అసెంబ్లీ సెగ్మెంట్‌కు 3 వేల చొప్పున మంజూరు చేయాలని సర్కారు నిర్ణయించింది. దీంతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఈ పథకం కింద 3 వేల మంది లబ్ధిదారులు నమోదు కానున్నారు.
- గృహలక్ష్మి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు క్షేత్ర స్థాయిలో ప్రచారం జరగడంతో ప్రజలు పెద్ద ఎత్తున శుక్రవారం అటు షేక్‌పేట, ఖైరతాబాద్ మండల కార్యాలయాలకు, ఇటు జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కార్యాలయానికి, మరో వైపు వార్డు కార్యాలయానికి క్యూ కట్టారు.
- అయితే ఎమ్మెల్యే, కార్పొరేటర్ స్థాయిలో మాత్రమే ఈ దరఖాస్తులు స్వీకరిస్తున్నారని తెలుసుకొని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌కు భారీగా తరలి వచ్చారు.
- ఇదిలా ఉండగా జీవో నెం 59 కింద లబ్ధి పొందిన వారు ఈ పథకానికి అనర్హులు అని ఇప్పటికే జీవో వెలువడింది.
- తప్పనిసరిగా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలనే నిబంధన పెట్టారు. ఈ నెల 20లోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని 25వ తేదీ నుంచి ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని నిర్ణయించారు.

డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు: ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నామని ఇందులో కొంత మంది లీడర్లు తలదూర్చి డబ్బులు వసూలు చేసి పథకాలు అందజేస్తామని తమ దృష్టికి వస్తే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు జైలుకు పంపిస్తామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన జూబ్లీహిల్స్ రోడ్ నెం. 7లోని దుర్గాభవానీనగర్‌బస్తీకి చెందిన బస్తీవాసులు పెద్ద ఎత్తున ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహలక్ష్మి, దళితబంధు, మైనార్టీ బంధు, బీసీ బంధు పథకాలు అందిస్తాయన్నారు. ఆయా పథకాల పేరుతో ఎవరైనా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా నాగేందర్ హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే దానం సమీక్ష

బంజారాహిల్స్: ఖైరతాబాద్, సోమాజిగూడ డివిజన్ల పరిధిలో అభివృద్ధి పనులపై శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ జీహెచ్‌ఎంసీ సర్కిల్–17 ఈఈ ఇందిరాబాయి, డీఈ చైతన్యతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజ్‌నగర్‌లో రూ. 40 లక్షల వ్యయంతో రెండు రోడ్లు వేయాల్సి ఉందని వెంటనే ప్రారంభించాలని అన్నారు. గాంధీతాతా నగర్‌లో రూ. 70 లక్షల వ్యయంతో చేయతలపెట్టిన పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. బీజేఆర్‌నగర్, ఇందిరానగర్‌లో రూ. 70 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కూడా వెంటనే ప్రారంభించాలన్నారు. బీజేఆర్‌నగర్, లక్ష్మీనగర్, జాగిర్దార్‌బాడాలలో రోడ్డు పనులు ప్రారంభించాలని అభివృద్ధి పనుల కోసం రూ. 8 కోట్లు కేటాయించామని ఆయన పేర్కొన్నారు.

తాజ్‌కృష్ణాలో బొటిక్స్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్



కార్యక్రమంలో పాల్గొన్న మోడల్స్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించే బొటిక్స్ ఆఫ్ ఇండియా ఫ్యాషన్ లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. దేశ వ్యాప్తంగా ప్రఖ్యాతి చెందిన ఫ్యాషన్ డిజైనర్లు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సంజయ్ అగర్వాల్ మాట్లాడుతూ దేశం నుంచి పది నగరాల లైఫ్‌స్టైల్ ఫ్యాషన్ డిజైనర్లు దుస్తులు, ఆభరణాలు ఇక్కడ ప్రదర్శిస్తున్నారని అన్నారు. సంప్రదాయ, పాశ్చాత్యశైలి దుస్తులతో పాటు ప్రఖ్యాత జ్యువెలరీ బ్రాండ్లు కూడా ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్ పాల్గొని దుస్తులు, ఆభరణాలను ప్రదర్శించారు.

'నా దేశం-నా మట్టి'పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

ఫిలింనగర్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టిన మేరా మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఫిలింనగర్ రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఈ విషయంపై అవగాహన కలిగించారు. నా దేశం-నా మట్టి అనే పేరుతో ఈ కార్యక్రమం నిర్వహించగా విద్యార్థులు దేశ రక్షణకు, సంఘీభావానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

కొనసాగుతున్న ఆయుర్వేద వైద్య విద్యార్థుల ఆందోళన

వెంగళరావునగర్: సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం స్టైఫండ్‌ను పెంచుతూ ఆ మేరకు నిధులను విడుదల చేయాలని డిమాండ్ ఆయుర్వేద వైద్య విద్యార్థులు చేస్తున్న ఆందోళన శుక్రవారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ... ప్రభుత్వం నిర్ణయం తీసుకోనందునే తమతోపాటు రోగులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. తక్షణమే సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆయుర్వేద కళాశాల పీజీ విద్యార్థులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ హిమజ, డాక్టర్ గౌతమి, డాక్టర్ అఖిల్, డాక్టర్ అలేఖ్య, డాక్టర్ రచన, డాక్టర్ కావ్య రష్మిక తదితరులు పాల్గొన్నారు.

కోట్లలో రుణాలిప్పిస్తానని రూ. 33 లక్షలు స్వాహా

వెంగళరావునగర్: కోట్లాది రూపాయల రుణం ఇస్తామని ఓ వ్యాపారి నుంచి కొందరు లక్షలాది రూపాయలు వసూలు చేసుకుని మోసం చేసిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... వెంగళరావునగర్‌కాలనీలో అభిషేక్‌రెడ్డి అనే వ్యాపారి ఉంటున్నాడు. ఇటీవల నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన శంకర్, మల్లికార్జున్, గణేష్ అనే వారితో పాటుగా మరికొందరు మహిళలు అతని ఇంటికి వచ్చి తమను తాము పరిచయం చేసుకున్నారు. తాము ఫైనాన్సియర్లమని, సినీ పరిశ్రమలోని వారికి, వ్యాపారవేత్తలకు కోట్లాది రూపాయలు రుణాలు ఇస్తుంటామని అతనికి చెప్పి నమ్మించారు. అయితే కోట్లల్లో రుణాలు పొందాలంటే సభ్యత్వం తీసుకోవాల్సి ఉంటుందని, ఇందుకోసం రూ. 30 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని నమ్మబలికారు. సభ్యత్వం తీసుకున్న కొన్ని రోజుల్లోనే రూ. 2 కోట్ల నుంచి రూ. 3 కోట్ల వరకు రుణాలు లభిస్తాయన్నారు. వారి హంగు ఆర్భాటాలు చూసి నమ్మిన అభిషేక్‌రెడ్డి వారికి రూ. 30 లక్షలు సభ్యత్వంగా చెల్లించాడు. అనంతరం ఇతర ప్రాసెసింగ్ ఫీజులంటూ మరో రూ. 3 లక్షలు వారు వసూలు చేశారు. ఎన్నిరోజులైనా అతనికి ఒక్క రూపాయి కూడా రుణం ఇవ్వలేదు. దాంతో తనకు రుణం వద్దని, తన వద్ద తీసుకున్న రూ. 30 లక్షలు తిరిగి చెల్లించాలని అభిషేక్‌రెడ్డి కోరాడు. అయితే వారు డబ్బును తిరిగి ఇవ్వకపోగా అభిషేక్‌రెడ్డిని బెదిరింపులకు గురి చేశారు. మరోసారి డబ్బులు అడిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మోసపోయాయని గ్రహించిన అభిషేక్‌రెడ్డి మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐక్యత కోసం జాతీయ స్థాయిలో ప్రచారం

పంజగుట్ట: ఐక్యత, ప్రేమ, మనం అంతా ఒక్కటే అనే నినాదాన్ని సమాజంలో పెంపొందించేందుకు 'మేరే ఘర్ ఆకేతో దేఖో' జాతీయ స్థాయి ప్రచారం చేస్తున్నట్లు భూమిక లేడీస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు సత్యవతి తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివిధ మహిళా, ట్రాన్స్‌జెండర్స్ సంఘాల నాయకులతో కలిసి మాట్లాడుతూ... కుల, మతతత్వ విద్వేషాలు దేశ ప్రజల మధ్య అఘాతం సృష్టిస్తోందన్నారు. ఆర్థిక పరమైన అసమానతలు తొలగించి అందరం ఐక్యమే అని నిరూపించేందుకు మా ఇంటికి ఒక్కసారి వచ్చిచూడండి, అనే క్యాంపెయినింగ్ ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ఇందులో ఐక్యత సామరస్యాన్ని ప్రోత్సహించడం, అన్ని వర్గాల మధ్య సామూహిక స్నేహం పెంపొందించడం, మహిళలు, దళితులు, ఆదివాసీలు, రైతులు, ట్రేడ్ యూనియన్లు ఉపాధ్యాయులు, విద్యార్థులను కలుపుకొని పోతామన్నారు. తాష్, సిస్టర్ లిసెన, రచన తదితరులు పాల్గొన్నారు.

నేడు యాంటీ ర్యాగింగ్ ర్యాలీ

లక్డీకాపూల్: నిమ్స్‌లో యాంటీ ర్యాగింగ్ అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు ఫిజియోథెరపీ కాలేజీ ప్రిన్సిపాల్ డా.శ్రావణ్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ద్రాక్షాయణి, అలైడ్ హెల్త్ సర్వీసెస్ కాలేజీ ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఉదయం జరిగే యాంటీ ర్యాంగింగ్ వాక్ కార్యక్రమంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, డీన్ డాక్టర్ లిజా రాజేశేఖర్, ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతివీర్, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యానారాయణ పాల్గొంటారన్నారు. ఈ నెల 14న ర్యాగింగ్ ఈజ్ యాన్ ఈవిల్ అంశంపై వక్తృత్వ పోటీ, 16న బెదిరింపులను ఆపండి-ర్యాగింగ్‌కు నో చెప్పండి అపూ అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్ ఉంటుందన్నారు.

పనులను సత్వరమే పూర్తి చేస్తాం

శ్రీనగర్‌కాలనీ: పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయనున్నట్లు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్‌నగర్‌కాలనీలో సుమారు రూ. 28 లక్షల వ్యయంతో చేపట్టిన సీవరేజ్ పనులను ప్రారంభించారు. రానున్న ఎన్నికలలలోపు అన్ని పనులను పూర్తి చేసి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తామని పేర్కొన్నారు. షరీఫ్, డి. సంజీవ, వినయ్‌సాగర్, చంద్రశేఖర్‌రెడ్డి, బద్రుద్దీన్, కోటేశ్వరరావు, వెంకటయ్య పాల్గొన్నారు.

ఎంఎన్‌సీలో ఉద్యోగాలంటూ రూ. 26 లక్షలతో పరార్

వెంగళరావునగర్: పెద్ద జీతాలు ఇంటర్నేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించి ఓ వ్యక్తి నిరుద్యోగుల నుంచి దాదాపు రూ. 26 లక్షలు వసూలు చేసి ఉడాయించిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం తెల్లబల్లి గ్రామానికి చెందిన నాగార్జున అనే యువకుడు ఎల్లారెడ్డిగూడలోని శ్రీశ్రీ బాలాజీ పీజీ హాస్టల్‌లో ఉంటూ చిన్న ప్రైవేట్ జాబ్ చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో హాస్టల్‌లో ఉండే సీతారామిరెడ్డి అనే వ్యక్తితో పరిచయం అయింది. తనకు ఇంటర్నేషనల్ కంపెనీల్లో తెలిసిన వారు ఉన్నారని, కొంత నగదును చెల్లిస్తే పెద్ద జీతాలు ఇచ్చే ఉద్యోగాలు ఇప్పిస్తానని నాగార్జునకు చెప్పారు. అతని మాటలు నమ్మిన నాగార్జున తాను రూ. 3.50 లక్షలు చెల్లించడంతోపుటు తన స్నేహితులైన ప్రవీణ్ (3.75 లక్షలు), మణికంఠ (3.75 లక్షలు), సంతోష్‌రెడ్డి (2.20 లక్షలు), ఫణి (1.96 లక్షలు), రత్న చరణ్ (2.23 లక్షలు) మరికొంతమంది వద్ద 8.61 లక్షలు ఇప్పించాడు. వాటన్నింటినీ తీసుకున్న సీతారామిరెడ్డి మూడు రోజుల కిందట రాత్రికిరాత్రి హాస్టల్ ఖాళీ చేసి వెళ్లిపోయాడు. అతని కోసం అనేకచోట్ల వెదికినా కనిపించకపోవడంతో తాము మోసపోయామని గ్రహించి మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దోస్త్ డిగ్రీ అడ్మిషన్ల చివరి ఫేజ్‌ను సద్వినియోగం చేసుకోండి

బంజారాహిల్స్: యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ సైఫాబాద్‌లో దోస్త్ డిగ్రీ అడ్మిషన్ల చివరి ఫేజ్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ జె.లక్ష్మణ్ నాయక్ కోరారు. గత నెల వర్షాల వల్ల, ఎంసెట్ కౌన్సెలింగ్ వల్ల విద్యార్థులు ఇంకా ఆయా కాలేజీల్లో చివరి దశ ఆప్షన్స్ పెట్టుకోవాలని కోరారు. సైఫాబాద్ సైన్స్ కాలేజీలో మొట్టమొదటిసారిగా ఒకేసారి మూడు కొత్త కోర్సులు ప్రవేశ పెట్టామన్నారు. కంప్యూటర్ సైన్స్ డాటా సైన్స్, స్టాటిస్టిక్స్ కంప్యూటర్ సైన్స్ అనే కొత్త కోర్సులు పరిచయం చేయడం జరిగిందని వెల్లడించారు. దోస్త్ ఇచ్చిన విధంగా స్పెషల్‌ఫేజ్ అడ్మిషన్ ప్రకారం ఈ నెల 5వ తేదీ నుంచి 13 తేదీ వరకు రూ. 400 దోస్త్ ఆన్‌లైన్ పోర్టల్‌లో విద్యార్థులు చెల్లించి రిజిస్టర్ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ నెల 7 నుంచి 14 వరకు స్పెషల్ ఫేజ్ వెబ్ ఆప్షన్ అందుబాటులో ఉందన్నారు. ఈ నెల 15న స్పెషల్ ఫేజ్ సీట్ అలాట్‌మెంట్ ఉంటుందని 18 నుంచ 21 వరకు విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలలో సెల్ఫ్ రిపోర్ట్ చేయాలన్నారు.

మిస్టర్ గ్లోబల్ టైటిల్ గెలుస్తా...

మిస్టర్ ఇండియా గ్లోబల్ విజేత జసన్ బ్రిట్ ఫెలీన్



మిస్టర్ ఇండియా టైటిల్ చూపిస్తున్న జసన్

పంజగుట్ట: మిస్టర్ గ్లోబల్ టైటిల్ గెలిచి తెలంగాణ, హైదరాబాద్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో నిలబెడతానని ఇటీవల జరిగిన మిస్టర్ ఇండియా గ్లోబల్‌గా విజయం సాధించిన జసన్ బ్రిట్ ఫెలీన్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మిస్టర్ ఇండియా గ్లోబల్ విశేషాలు వెల్లడించాడు. గ్లోబల్ మిస్టర్ ఇండియా పోటీలకు దేశవ్యాప్తంగా 65 వేల దరఖాస్తులు వచ్చాయని అందులో 32 మందిని ఎంపికచేసి అందులోంచి తిరిగి 25 మందిని ఫైనల్ లిస్టు చేశారని తెలిపారు. పబ్లిక్ స్పీకింగ్, ఫిట్‌నెస్, జనరల్ నాలెడ్జి, ట్యాలెంట్, గుడ్‌మ్యానరిజం, గుడ్ లుక్స్ అన్నింటిలో తాను ముందంజలో ఉండి మిస్టర్ ఇండియా గ్లోబల్‌గా నిలిచానని వెల్లడించారు. నవంబర్‌లో థాయిలాండ్‌లో జరిగే మిస్టర్ గ్లోబల్‌కు భారత్ తరపున తాను బరిలోకి దిగనున్నట్లు తెలిపారు. రుబారు మిస్టర్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు గోవాలోని బోగ్మాల్ బీచ్ రిసాట్‌లో పోటీలు జరిగాయన్నారు. మిస్టర్ గ్లోబల్ ప్రదిత్ ప్రదినూత్ చేతులమీదుగా మెడల్ అందుకున్నానని తెలిపారు. చిన్నతనం నుంచే తల్లితండ్రులు పేద పిల్లలను ఆదుకోవడం, కుష్ఠు రోగులకు సేవ చేయడం, అనాథలను చేరదీయడం, పేదవారికి చదువులు చెప్పించడం తమ ఫ్యామిలీ ఎడ్యు వీజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తుంటామని ఆయన తెలిపారు. జసన్ తల్లి చందన బ్రిట్ ఫెలీన్, తండ్రి వాలెంటన్ బ్రిట్ ఫిలీన్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు శిబిరానికి మంచి స్పందన



ఎమ్మెల్యే కాలనీ పోలింగ్ బూత్‌లో ఓటరు నమోదులో పాల్గొన్న కాలనీవాసులు

బంజారాహిల్స్: ఓటరు జాబితాలో తప్పొప్పుల సవరణలతో పాటు చిరునామా మార్పిడి, కొత్త ఓటర్ల నమోదుపై ప్రజలు శ్రద్ధ చూపాలని జీహెచ్ఎంసీ అధికారులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగానే ఓటరు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని ఎమ్మెల్యే కాలనీ పోలింగ్ బూత్‌లో నిర్వహించిన ఓటరు నమోదు శిబిరానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలని బీఎల్‌వోలుగా సూచించారు. అందుబాటులో ఓటరు జాబితాను ఉంచారు.

గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలి

ఫిలింనగర్: గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేయాలని కోరుతూ గురువారం టీఎస్‌పీఎస్‌సీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగిన లెక్చరర్ అశోక్‌ను పోలీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించగా శుక్రవారం ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి ఆయనను పరామర్శించారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని దుయ్యబట్టారు. ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని ఈ అరెస్ట్ ద్వారా బయటపడిందని అన్నారు. తక్షణం పరీక్షలను వాయిదా వేయాలని ఆయన డిమాండ్ చేశారు.



లెక్చరర్‌ను పరామర్శించి వస్తున్న డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి

కఠిన చట్టాలతోనే మహిళలకు రక్ష

సినీ నటుడు సుమన్



మాట్లాడుతున్న సుమన్

వెంగళరావునగర్: మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు, హత్యాకాండలను నియంత్రించే విషయంలో దేశంలో చట్టాలు మరింత కఠినంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ సినీనటుడు సుమన్ అభిప్రాయపడ్డారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం ఎన్‌కేఎఫ్‌ఐ కరాటే డూ ఫెడరేషన్, తెలంగాణ అమెచ్యూర్ స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 4వ ఆలిండియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. కరాటే పోటీలకు 18 రాష్ట్రాలకు చెందిన 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీలు రెండురోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు వెల్లడించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుమన్ మాట్లాడుతూ... చాలా దేశాలతో పోల్చితే మనదేశంలో చట్టాలు వాటి అమలు అంత కఠినంగా లేవని అన్నారు. చట్టాల్లోని లొసుగులను అడ్డం పెట్టుకుని అనేక మంది ఉన్నత వర్గాలకు చెందిన వారు సైతం తప్పులు చేసి కూడా తప్పించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, చిన్న పిల్లలమీద కూడా అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో మహిళలు, విద్యార్థినులు సైతం తమను తాము రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కరాటే లాంటి ఆత్మరక్షణ విద్యల వల్లనే ఇది సాధ్యమవుతుందన్నారు. ఎన్‌కేఎఫ్‌ఐ సంస్థ చైర్మన్ డాక్టర్ వి.రవి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. పోటీల ఆర్గనైజర్ సహదేవ్, ఎన్‌కేఎఫ్‌ఐ అధ్యక్షుడు అజయ్‌శర్మ, జనరల్ సెక్రటరీ లాల్‌దాదా, రుద్రమదేవి అకాడమీ వ్యవవస్థాపకురాలు ఎస్.లక్ష్మీసామ్రాజ్యం, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీలత

ఫిలింనగర్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో ఇండియన్ ఎకానమీ అనే అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల 11, 12వ తరగతుల విద్యార్థులు నాలుగు జట్లుగా ఏర్పడి ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలు వశిష్ఠ హౌస్ విజేతగా నిలిచింది. 120 పాయింట్లు సాధించిన వశిష్ఠ హౌస్‌కు స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతా నాయర్, డి.వి.ఎన్.గోపాలకృష్ణన్ తదితరులు బహుమతులను ప్రదానం చేశారు. మొదటి రన్నరప్‌గా అర్జున హౌజ్, రెండో రన్నరప్‌గా కృష్ణహౌస్‌లు నిలిచాయి.

సీసీ రోడ్డు పనులను నాణ్యతతో పూర్తి చేయాలి

ఖైరతాబాద్: సీసీ రోడ్డు పనులను నాణ్యతతో పూర్తిచేయడంతో పాటు లెవలింగ్ కలిసేలా పనులు చేపట్టాలని కార్పొరేటర్ విజయారెడ్డి తెలిపారు. శుక్రవారం ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో డీఈ చైతన్యతో కలిసి పనులను పరిశీలించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సీవరేజి పైప్‌లైన్ పనులను పూర్తిచేయాలన్నారు. ప్రస్తుతం చేపడుతున్న సీసీ రోడ్డు పనులను నాణ్యతతో పాటు లెవలింగ్ కలిసేలా ఏర్పాటు చేయాలని సూచించారు.



లక్ష్మీనగర్‌లో రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

సందడిగా 'వన్ చైల్డ్-వన్ ప్లాంట్'



జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్ నేచర్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. వన్ చైల్డ్-వన్ ప్లాంట్ అనే క్యాంపెయిన్‌లో భాగంగా విద్యార్థులంతా రకరకాల మొక్కలను తీసుకొచ్చి ఆవరణలో నాటారు. అలాగే మొక్కలను బహుమతులుగా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలతా నాయర్ తదితరులు పాల్గొన్నారు. –బంజారాహిల్స్